ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు

● డీఈవో అనురాధ



డీఈవో కార్యాలయంలో ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న డీఈవో అనురాధ

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 27: ప్రభుత్వ సాయంతో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా అడ్మిషన్లు పొందవచ్చని డీఈవో అనురాధ అన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ఆవరణలో ఉచిత విద్యకు సంబంధించి నిబంధనలతో కలిగిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడ్మిషన్లు పొందిన వారి ఫీజులు ప్రభుత్వమే నేరుగా ప్రైవేటు పాఠశాలలకు చెల్లిస్తుందన్నారు. ఆర్టీఈ చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద పిల్లలకు కేటాయించాలన్నారు. 1వతరగతిలో మాత్రమే ఈ అడ్మిషన్లు ఉంటాయన్నారు. ఆ తరువాత పైతరగతులకు కొనసాగుతారని తెలిపారు. పిల్లల సమీప ప్రాంతంలోని అన్ని రకాల ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు వంటి ప్రతికూల పరిస్థితుల ఎదుర్కొంటున్న వర్గాల వారికి 5శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీనవర్గాలకు చెందిన 4 శాతం కల్పిస్తున్నట్లు తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ల కోసం మార్చి 5 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 1800 4258599 టోల్‌ఫ్రీ నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఓటర్లుగా తొలగించాలంటూ ఇచ్చిన తప్పుడు సమాచారంపై విచారణ



తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వో, బీఎల్‌వోను విచారిస్తున్న హెడ్‌కానిస్టేబుల్

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 27: ఎర్రగుంట్ల మండలంలోని ఇల్లూరు గ్రామంలో టీడీపీ నాయకుల ఓట్లను తొలగించాలన్న దురుద్దేశంతో అదే గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డి మరికొందరు ఫాం-7లో తప్పుడు సమాచారం ఇవ్వడంపై కలమల్ల పోలీసులు విచారణ చేపట్టారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వో మల్లికార్జున, బీఎల్‌వోలు నాగమణి, ప్రవీణ్‌లను హెడ్‌కానిస్టేబుల్ భద్రారెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఫారం-7కు సంబంధించిన మొత్తం వివరాలను, అలాగే వీఆర్వో, బీఎల్‌వోలు వాటిపై చేపట్టిన విచారణ, ఇతర అంశాలపై పరిశీలించారు. ఇల్లూరులో బాధితులను కూడా విచారించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు పోలీసులు తెలిపారు.

డిసెంబర్‌లో ఫాం-7 దరఖాస్తుల సమర్పణ

2023 డిసెంబరు 3వ తేదీన ఇల్లూరుకు చెందిన వైసీపీ నాయకులు చిన్నదస్తగిరిరెడ్డి, ఇల్లూరు క్రిష్ణారెడ్డి, కనపర్తి రఘురామిరెడ్డి, రమణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, వెంకటరమణారెడ్డి, ఎం.పెద్దదస్తగిరిరెడ్డిలు ఫాం-7లో టీడీపీకి చెందిన 44మందిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్ఓ, బీఎల్‌వోలు డిసెంబర్ 4వ తేదీ నుంచి 19వ తేదీ వరకు విచారణ చేపట్టి ఇందులో కేవలం ఇద్దరివి మాత్రమే సక్రమంగా లేవని మిగతా 42మంది ఓట్లు సక్రమంగా ఉన్నాయని అధికారులకు నివేదిక ఇచ్చారు. ఇందుకు సంబంధించి 42మంది కూడా తమకు రెండు చోట్ల ఓట్లు లేవని ఒకవేళ అలా ఉంటే తమపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చునని వారు అఫడవిట్ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. రెండు చోట్ల ఓట్లు ఉన్నాయేమోనని ఆర్డీవో లాగిన్‌లో కూడా తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. కేవలం ఒకేచోట ఓటుఉన్నట్లు తేలడంతో పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేసి పంపారు.

కేసు నమోదు చేశాం

కోర్టు ఆదేశాలమేరకు 8మందిపై కేసునమోదు చేశామని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం రెవెన్యూ అధికారుల వద్ద ఫాం-7కు సంబంధించిన అన్ని వివరాలు సేకరించామన్నారు. తరువాత 42మందితో మాట్లాడి విచారిస్తామని పేర్కొన్నారు. యాధావిధిగా కేసు కొనసాగుతుందన్నారు. చార్జిషీట్ వేసేందుకు మరింత సమయం పడుతుందన్నారు. ఫాం-7 ద్వారా తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యవహారంలో జిల్లాలో ఇది మొదటి కేసని పోలీసులు తెలిపారు.

వైసీపీలో గందరగోళం

● ఖరారు కాని టికెట్లు

● షర్మిల ప్రభావంతో కొన్నిచోట్ల సీట్లు మారే అవకాశం ?

● కడప ఎంపీ స్థానానికి షర్మిల లేదా సునీత పోటీ చేస్తే.. అసెంబ్లీ బరిలో అవినాశ్





(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సోదరి వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టిన ప్రభావం కాంగ్రెస్ పార్టీకన్నా వైసీపీలోనే ఎక్కువగా ఉంది. షర్మిల పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడంతో సొంత జిల్లాలోని వైసీపీలో అభ్యర్థుల ఎంపికపై గందరగోళం నెలకొందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. నాలుగురోజుల క్రితం టీడీపీ, జనసేన కలిసి 99 మంది అభ్యర్థులను ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో టీడీపీ నాలుగుచోట్ల అభ్యర్థులను ఖరారు చేసింది. అయితే జగన్ పార్టీ మాత్రం సొంత జిల్లాలోనే ఇంకా అభ్యర్థులను అధికారికంగా ఖరారు చేయలేదు. వివిధ సర్వేలు ఫలితాలు, షర్మిల కాంగ్రెస్‌లో చేరడంతో వైసీపీలో గందరగోళం మొదలైందని అంటున్నారు. ఇంకా అధికారికంగా జిల్లాలో ఒక్కరికి కూడా వైసీపీ టికెట్ కన్‌ఫర్మ్ చేయలేదు. పలుమార్లు రాష్ట్రంలో పలు నియోజక వర్గాలకు కొత్తవారిని సమన్వయకర్తలుగా నియమించింది. ఉమ్మడి జిల్లాలోని రాజంపేట అసెంబ్లీ స్థానానికి జడ్పీచైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని సమన్వయ కర్తగా నియమించారు. అంటే అక్కడ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి ఈసారి టికెట్ లేదని స్పష్టమయింది. ఇక సొంత జిల్లాలో మాత్రం ఇంకా ఎవ్వరినీ ప్రకటించలేదు. కొత్తవారినీ సమ న్వయకర్తగా నియమించలేదు. దాదాపు సిట్టింగ్‌లకే మళ్లీ టికెట్లు వస్తాయని గతంలో ప్రచార సాగింది. అయితే షర్మిల కాంగ్రెస్‌లోకి అడుగు పెట్టిన తరువాత జగన్ శిబిరం అయోమయంలో ఉందని అంటున్నారు. జగన్ సొంతంగా పార్టీ పెట్టిన తరువాత 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రాజంపేటను మాత్రమే టీడీపీ కైవసం చేసుకోగా మిగతా 9 స్థానాలను వైసీపీ దక్కించుకుంది. 2019లో 10 అసెంబ్లీ, 2 పార్లమెంటు స్థానాలను వైసీపీ క్లీన్‌స్వీప్ చేసింది. తరువాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార జులుం చూపించి కొన్ని చోట్ల, మరికొన్నిచోట్ల దౌర్జన్యం చేసి గంపగుత్తగా గెలుచుకుంది. మైదుకూరు మున్సిపాలిటీలో మాత్రం టీడీపీ సత్తా చాటింది. బద్వేలులో మెరుగైన స్థానాలను గెలుచుకుంది.

షర్మిల లేదా సునీత బరిలో దిగితే..

బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పేరిట జిల్లాలో టీడీపీ ఇన్‌చార్జిలు, పలువురు ఆశావహులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే చేకూరే సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ నిరుద్యోగ భృతి, రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థికసాయం అంటూ ప్రచారంలో దూసుకెళుతున్నారు. ఇప్పటికే టీడీపీ వారు జిల్లా ప్రజలకు చాలావరకు చేరువయ్యారు. ఈ సమయంలో వైఎస్ జగన్ సోదరి వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. వచ్చిన వెంటనే నేరుగా జగన్‌పై విమర్శల దాడికి పూనుకున్నారు. దీంతో సోషల్ మీడియాలో పేటీయం బ్యాచ్ షర్మిలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడినా ఆమె డోంట్ కేర్ అంటూ ముందుకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో కడప పార్లమెంటు స్థానానికి షర్మిల లేదా వైఎస్ వివేకా కూతురు సునీత లేదా ఆమె తల్లి సౌభాగ్యమ్మ పోటీ చేస్తారనే ప్రచారం ఊపందుకుంది. ఇదే జరిగితే అవినాశ్‌రెడ్డిని కడప ఎంపీ స్థానానికి కాకుండా ఎమ్మెల్యేగా పంపించాలని జగన్ శిబిరం భావిస్తున్నట్లు వైసీపీలో ప్రచారం సాగుతోంది. ఇప్పటికే వివేకా హత్య విషయం తప్ప షర్మిల మిగతా అన్ని వైఫల్యాలను ప్రశ్నిస్తున్నారు. సాక్షిలో సైతం తనకు సగం వాటా ఉందని చెప్పుకొచ్చారు. వీళ్లే ఎంపీగా బరిలోకి దిగితే సునీత, షర్మిల వ్యాఖ్యలు జనాల్లోకి బాగా వెళ్లి నష్టం కలుగుతుందని జగన్ శిబిరం ఆందోళనలో ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో ఒకవేళ షర్మిల లేదా వివేకా కుటుంబం నుంచి ఎవరైనా పోటీ చేస్తే అవినాశ్‌ను జమ్మలమడుగు లేదా కమలాపురం అసెంబ్లీ నుంచి బరిలో దించుతారనే ప్రచారం సాగుతోంది. మార్చి 3 తరువాత వైసీపీ అభ్యర్థులను ప్రకటిస్తారని ఆ పార్టీ నేతలు చెబు తున్నారు. మరి జిల్లాలో సిట్టింగ్‌లను అందరినీ కొన సాగిస్తారా లేక మార్పు ఉంటుందా అని మరో వారం తరువాత కానీ తెలిసే పరిస్థితి కనిపించలేదు. దీంతో ప్రస్తుతానికి వైసీపీలో అందరూ అయోమయంలో ఉన్నారు.

12 మంది వైసీపీ నేతలకు గన్‌మేన్ల తొలగింపు

● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఫిర్యాదు ఫలితం

(కడప-ఆంధ్రజ్యోతి): కనీస నిబంధనలు పాటించకుండా అధికారం మాటున వైసీపీ నేతలకు అడ్డగోలుగా ఇచ్చిన గన్‌మేన్ల సదుపాయాన్ని ఎట్టకేలకు 12 మందికి తొలగించారు. ఎవరికయినా భద్రత కల్పించాలంటే సెక్యూరిటీ రివ్యూ కమిటీ నిర్ణయం మేరకు గన్‌మేన్లను ఇస్తుంటారు. అయితే జిల్లాలో అధికార పార్టీ నేతలు ఎవరికి చెబితే వారికి గన్‌మేన్ల సౌకర్యం ఇచ్చారు. అధికార పార్టీ అనేదే అర్హతగా ఎలాంటి ముప్పులేని వైసీపీ నేతలకు కూడా భద్రత కల్పించారు. ఈ అవకాశాన్ని వారు దుర్వినియోగం చేస్తున్నట్లు విమర్శలున్నాయి. సార్వత్రిక ఎన్నికలవేళ అనధికారికంగా ఇచ్చిన గన్‌మేన్లను తొలగించడంతో పాటు ప్రతిపక్ష నేతలకు కూడా సరైన భద్రత కల్పించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఈ నెల 12న ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

ఈ మేరకు.. వేంపల్లె ఎంపీపీ రవికుమార్‌రెడ్డి, అగ్రికల్చర్ అడ్వయిజర్ తిరుపాల్‌రెడ్డి, ఏపీపీఎస్ మెంబరు నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, సింహాద్రిపురానికి చెందిన వైసీపీ లీడరు హరినాథరెడ్డి, సింహాద్రిపురం మండల ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, లింగాల మండలంలోని గుణకన పల్లెకు చెందిన జీవీ క్రిష్ణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, పులివెందులకు చెందిన పుష్పనాథరెడ్డి, క్రిష్ణారెడ్డి, ఏపీ భాస్కర్‌రెడ్డి, ముద్దనూరుకు చెందిన మునిరాజారెడ్డి, ముద్దనూరు ఎంపీపీ ప్రదీప్ రెడ్డి, కడపకు చెందిన చింతలకుంట రమేశ్‌రెడ్డి, ప్రొద్దుటూరుకు చెందిన కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కాశినాయన మాజీ మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, ఇండస్ట్రియల్ అడ్వయిజరు రాజోలి వీరారెడ్డి, ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ హర్షవర్థన్‌రెడ్డి, కడప డిప్యూటీ మేయరు బండి నిత్యానందరెడ్డి, పోరుమామిళ్లకు చెందిన ఏపీ స్టేట్‌ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ అమర్ నాథరెడ్డిలకు 1ప్లస్ 1 గన్‌మెన్ల సౌకర్యాలు ఉన్నాయంటూ ఎమ్మెల్సీ ఈసీ కమిషన్ దృష్టికి తీసు కెళ్లారు. దీన్ని పరిశీలించిన ఎన్నికల కమిషన్ వీరిలో 12 మందికి గన్‌మేన్ల సౌకర్యాన్ని తొలగించింది.

ఎన్నికల ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 27: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా సంసిద్ధం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జాయింట్ కలెక్టర్ గణేశ్ కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూషలతో కలసి ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి మ్యాన్ పవర్ మేనేజ్మెంట్, మెటీరియల్, రవాణా, పోస్టల్ బ్యాలెట్, సి-విజిల్, ఈవీఎం మేనేజ్మెంట్ తదితర అంశాలపై నోడల్ అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. నోడల్ అధికారులకు కేటాయించిన విధులకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ యధుభూషణ్ రెడ్డి, ఎస్ఎస్ఏ పీవో డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ బ్రహ్మయ్య, వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు, సీపీవో వెంకటరావు పాల్గొన్నారు.

వైసీపీ రాజకీయాలకు క్రికెటర్‌ను బలి చేశారు

● జగన్‌రెడ్డి రాజకీయ లబ్ధికే ఆడుదాం ఆంధ్ర

● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 27: వైసీపీ క్రీడా రాజకీయాలకు ఆంధ్ర రంజీ క్రీడారుడు విహారిని బలి చేశారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆరోపించారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలో టీడీపీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసమే ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలు నిర్వహించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ అరాచకాలు, రాజకీయ రాక్షస క్రీడలతో మన రాష్ట్రం గర్వించదగ్గ క్రీడాకారులను సైతం బలి చేస్తున్నారని విమర్శించారు. ఆంధ్ర రంజీ జట్టుకి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న హనుమ విహారి కూడా ఈ ప్రభుత్వ అరాచకాలు భరించలేక రాజీనామా చేస్తున్నానని చెప్పి భవిష్యత్తులో కూడా నేను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ఆడనని చెప్పి బహిరంగంగా సోషల్ మీడియాతో పోస్టు పెట్టారంటే ఈ సైకో ప్రభుత్వం చివరికి క్రీడాకారులను కూడా వదలడం లేదనడానికి ఇది ఒక నిదర్శనం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో క్రీడాకారులను ప్రోత్సహించిన పాపాన పోలేదన్నారు. వైసీపీ నాయకుడి కుమారుడి కోసం హనుమ విహారి లాంటి ఒక ఉత్తమ క్రీడాకారుడిని తొలగించడం అన్యాయమన్నారు. జగన్‌రెడ్డి పరిపాలనలో క్రీడా వ్యవస్థను నీరుగార్చారని, క్రీడాభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. హనుమ విహారిపై వైసీపీ నేతల వ్యాఖ్యలు అర్థరహితమని, తక్షణమే క్షమాపణలు చెప్పి అతడికి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించి రాష్ట్ర క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర యువతలో ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువైందని గమనించిన ముఖ్యమంత్రి జగన్ రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం ఆడుదాం-ఆంధ్ర పేరుతో సరికొత్త ప్రచార ఆర్భాటం చేశారన్నారు. అందులోనూ నాసిరకం క్రీడా వస్తువులను ఉపయోగించారని ఆయన విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం క్రీడాకారుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టను దిగజార్చుతున్నారన్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న వికృత చేష్టలకు ఉత్తమ క్రీడాకారులు కూడా పొరుగు రాష్ట్రాలకు వలసపోయే పరిస్థితులు తీసుకొచ్చారని ఆరోపించారు. ఇప్పటికే పెట్టుబడులను పొరుగు రాష్ట్రాలకు తరిమేసి ఇక్కడ నిరుద్యోగం పెంచారన్నారు. సమావేశంలో వీరబల్లి మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, మట్లి సర్పంచ్ నాగార్జునాచారి, టీడీపీ నేతలు నాగభూషణంనాయుడు, రాజానాయుడు, బాలకృష్ణ, దుర్గం ఆంజనేయులు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై చర్చకు సిద్ధమా ?

● వ్యవసాయానికి నీళ్లు లేవు

● యువతకు ఉపాధి లేదు

● కేసులకు భయపడి కేంద్రానికి జగన్‌రెడ్డి దాసోహం

● ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 27: "జిల్లాలో గండికోట, మైలవరం జలాశయాల్లో నీరున్నా జిల్లా రైతులకు వ్యవసాయానికి నీరివ్వలేని దుస్థితి నెలకొంది. ఉపాధి లేక యువత గంజాయి, బెట్టింగ్, అసాంఘిక కార్యకలాపాల వైపు ఆకర్షితులవు తున్నారు. కేంద్రం ప్రకటించిన విభజన హామీలు వైసీపీ గాలికి వదిలేసింది. కేసులకు భయపడి జగన్‌రెడ్డి కేంద్రానికి దాసోహమయ్యారు. జిల్లా అభివృద్ధిపై వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు చర్చలకు సిద్ధమా" అని టీడీపీ ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్ రెడ్డి సవాల్ చేశారు. మంగళవారం కడప నగరంలోని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి కుప్పం సభలో చంద్రబాబునాయుడు కుప్పానికి ఏం చేశాడని ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అమ్మకు అన్నం పెట్టనివాడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాడా అని వైఎస్సార్ చెప్పిన మాట ఇప్పుడు జగన్‌కే వర్తిస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాకు కడప బిడ్డగా జగన్‌మోహనరెడ్డి ఏం చేశారని ప్రశ్నించారు. జిల్లా యువతకు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చావా అని ప్రశ్నించారు. స్టీలు ప్లాంటు గాలికి వదిలేశారని, కొప్పర్తిని పారిశ్రామిక హబ్‌గా చేస్తానని ఒక్క పరిశ్రమ కూడా పెట్టలేదన్నారు. చెన్నూరు షుగరు ఫ్యాక్టరీ, ప్రొద్దుటూరు పాలకేంద్రం, నందలూరు ఆల్విన్ ఫ్యాక్టరీ తెరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి దాదాపు ఐదేళ్లు పూర్తవుతున్నా ఇప్పటి వరకు తెరిచారా అని ప్రశ్నించారు. అన్నమయ్య డ్యాం తెగిపోయి రెండేళ్లు దాటినా ఇంత వరకు దానిని నిర్మించలేదన్నారు. కడప జిల్లాకు ఒక్క రైల్వే లైను అయినా తెచ్చారా అని ప్రశ్నించారు. మీ కేసులకు, అవినాశ్ కేసులకు భయపడి కేంద్రానికి దాసోహం అయ్యారన్నారు. వీటిపై కావాలంటే బహిరంగచర్చకు తాను వస్తానని సవాల్ చేశారు. పెరిగిన ధరలు తగ్గాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ఉద్యోగులను అడ్డుకోవడం దుర్మార్గం : జేఏసీ

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 27: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా ఎన్జీవో హోం వద్ద జేఏసీ ఉద్యోగ సంఘ నేతలు పోలీసు, ప్రభుత్వ తీరుపై నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా నాలుగేళ్లుగా కాలయాపన చేసిందన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడకు పిలుపు ఇస్తే జేఏసీ నేతలకు నోటీసులు జారీ చేయడం, కేసులు పెట్టడం అన్యాయమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిమ్మారెడ్డి, శ్రీను, బాల పుల్లయ్య, మోహన్‌రెడ్డి, రాజు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



ఎన్జీవో హోం వద్ద నిరసన తెలుపుతున్న జేఏసీ నేతలు

ఏపీఎండీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 27: సమాన పనికి సమాన వేతనంలో జరిగిన లోటు పాట్లకు సంబంధించిన వాటిని పరిష్కరించాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను హైదరాబాదులో కలిసినట్లు పోరాట కమిటీ జేఏసీ నాయకులు తెలిపారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వద్ద కార్మికులకు సంబంధించిన చర్చలు జరిపినట్లు తెలిపారు. సమావేశానికి ఏపీఎండీసీ యాజమాన్యం చర్చలకు రాలేదని, మార్చి 9వ తేదీ యూనియన్స్‌తో జరిగే చర్చలలో సమస్య పరిష్కారం అవుతుందని లేబర్ కమిషనర్‌కి తెలియజేశారన్నారు. ఇందుకు లేబర్ కమిషనర్ 14వ తేదీకి చర్చలు వాయిదా వేశారని తెలిపారు. ఈ చర్చలలోనే రిటైర్మెంట్ అయిన కార్మికులకు గ్రాట్యూటీ అమౌంట్ చెల్లించాలని లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

టెట్ ప్రశాంతం

● తొలిరోజు పరీక్షకు 87 శాతం మంది హాజరు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 27: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రశాంతంగా ప్రారంభమైంది. తొలిరోజు 87 శాతం అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలో మంగళవారం ఏడు కేంద్రాల్లో రెండు సెషన్స్‌లో ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన మొదటి సెషన్‌లో 847 మంది హాజరు కావాల్సి ఉండగా 715 మంది హాజరయ్యారు. 132 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో 860 మందికి గాను 785 మంది హాజరు కాగా 75 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్లకు సంబంధించి 1,707 మందికి గాను 1,500 మంది మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలను జిల్లా పరిశీలకులు మోడల్ స్కూల్స్ జేడీ ఎంవీ క్రిష్ణారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా పరీక్షలు జరిగాయన్నారు. అభ్యర్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమకూర్చామన్నారు.



ఆన్‌లైన్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న జిల్లా పరిశీలకులు ఎంవీ క్రిష్ణారెడ్డి

తండ్రి చేతిలో తనయుడు హతం

మద్యానికి బానిసై తల్లిదండ్రులకు వేధింపులు.. భరించలేకే హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ పార్థసారథి

చెన్నూరు, ఫిబ్రవరి 27 : మద్యానికి బానిసైన కొడుకు తండ్రిని చంపబోగా భయపడ్డ తండ్రి కొడుకునే హతమార్చిన సంఘటన మండలంలోని కొండపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. చెన్నూరు పోలీసుల వివరాలు, గ్రామ వీఆర్వో నిర్మల సమాచారం మేరకు... కొండపేటకు చెందిన ఉండేల చిన్నరామిరెడ్డి కుమారుడు ఓబుల్‌రెడ్డి (39) మద్యానికి బానిసయ్యాడు. పదేళ్ల క్రితం ఓబుల్‌రెడ్డికి వివాహమైంది. ఓబుల్‌రెడ్డి విపరీతంగా మద్యం తాగుతుండటంతో పెళ్లయిన ఏడాదికే భర్తను వదిలి భార్య పుట్టింటికి వెళ్లింది. అయినా ఓబుల్‌రెడ్డి మద్యం తాగడం మానేయలేదు. మద్యం అతిగా తాగి వచ్చి తల్లిదండ్రులతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం విపరీతంగా మద్యం తాగి తండ్రిపై దాడి చేశాడు. ఆయనను కొట్టి గొంతుపై కాలు పెట్టి తొక్కగా, ఆయన ఎలాగోలా తప్పించుకుని బయటపడ్డాడు. కాగా మంగళవారం మళ్లీ మద్యం తాగి ఇంట్లో తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. మద్యానికి డబ్బు ఇవ్వాలని తల్లిదండ్రులను వేధించడంతో అతడి తల్లి బ్యాంకుకు వెళ్లి డబ్బు తెస్తానని చెప్పి బయటికి పోయింది. కాగా ఇంట్లో ఉన్న తండ్రితో మళ్లీ గొడవ పడి దాడి చేయబోగా ఆయన తనను చంపుతాడేమోననే భయంతో ఇంట్లో ఉన్న రోకలిబడె తీసుకుని కొడుకు తలపై మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టుపక్కలవారికి తెలియడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. గ్రామ వీఆర్వో నిర్మల హత్య జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. సీఐ పార్థసారథి హత్య జరిగిన ప్రదేశానికి చేరుకుని ఓబుల్‌రెడ్డి తండ్రిని విచారించారు. పూర్తి వివరాలు సేకరించిన అనంతరం అతడిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అలాగే మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి



ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 27: ఎర్రగుంట్ల వినాయకనగర్ సచివాలయం సమీపంలో ఆర్వోబీ కింద 60 ఏళ్ల వృద్ధుడు మంగళవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఉదయం నుంచి బ్రిడ్జి కింద పడిపోయి ఉన్నాడు. అయితే అతను మద్యం మత్తులో ఉన్నాడని ఎవరూ పట్టించుకోలేదు. అయితే సాయంత్రం వరకు అలాగే పడి ఉండటంతో స్థానికులు 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది పరీక్షలు నిర్వహించి మృతిచెందినట్లు తెలిపారు. అయితే వృద్ధుడు ఎర్రగుంట్ల ప్రాంతానికే చెందినవాడుగా చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 27: మండలంలోని మాచునూరు రెవెన్యూ పొలంలో ఉన్న ఐరన్ ఓర్ మైన్‌లో మంగళవారం విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న పంగా పెద్ద గంగన్న (40) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... స్తంభంపై విద్యుత్ మరమ్మతులు చేస్తున్న పెద్ద గంగన్న షాక్ తగిలి కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం కడపకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కు చనిపోవడంతో కుటుంబం రోడ్డున పడింది. గంగన్న స్వగ్రామం గోపరాజుపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



లావణ్య (ఫైల్)

సీకేదిన్నె, ఫిబ్రవరి 27: అనుమానాస్పద స్థితిలో బి.లావణ్య (20) మృతిచెందినట్లు ఏఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు... గాలివీడు మండలం వడిశలంక గ్రామానికి చెందిన గణేష్‌రెడ్డికి శ్రీకాకుళం జిల్లా ఇద్దిగానిపాళెంకు చెందిన లావణ్యకు నెల రోజుల క్రితం వివాహమైంది. వీరిరువురు మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో నివాసం ఉండేవారు. గణేష్‌రెడ్డి ఓ ప్రైవేటు స్కూలులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండేవాడు. ఏమైందో ఏమోగాని మంగళవారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరు లేని సమయంలో లావణ్య ఉరి వేసుకుని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంసీఎంసీ కమిటీలు కీలకపాత్ర పోషిస్తాయి



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ గుర్రప్ప

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 27: ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ, ఎంసీఎంసీ కమిటీలు ఎన్నికల్లో కీలకపాత్ర పోషిస్తాయని మాస్టర్ ట్రైనర్ గుర్రప్ప తెలిపారు. మంగళవారం స్థానిక రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ, ఎంసీఎంసీ కమిటీల్లో పనిచేయబోయే అధికారులు, సిబ్బందికి నోడల్ అధికారి (శిక్షణ) ధనలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రప్ప మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చు గరిష్ట పరిమితిని ఎన్నికల కమిషన్ నిర్ణయిస్తుందన్నారు. ప్రతి అభ్యర్థి ఖర్చులను వ్యయ పర్యవేక్షణ కమిటీ నిశితంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ గురించి మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులు ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలను తమ ప్రచారాలకు వాడుకుంటారన్నారు. ఎన్నికల సమయంలో మీడియాను పర్యవేక్షించి స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు ఎంసీఎంసీ కమిటీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా ఆడిట్ అధికారి నాగరాజు, జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గాల ఆడిట్ అధికారులు, సమాచార, పౌర సంబంధాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకర బర్డ్‌ఫ్లూ వైరస్‌ను కట్టడి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ గుణశేఖర్ పిళ్లై

చిట్వేలి, ఫిబ్రవరి 27 : జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదకర బర్డ్‌ఫ్లూ వైరస్‌ను కట్టడి చేద్దామని పశు వైద్య శాఖ జేడీ డాక్టర్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. మంగళవారం స్థానిక ఏరియా పశు వైద్యశాలలో జరిగిన బర్డ్‌ఫ్లూ వైరస్ నిరోధక సంయుక్త సమావేశంలో ఆయన ఉమ్మడి కడప జిల్లా పశువ్యాధుల నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాంతక బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రబలకుండా తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యల గురించి సిబ్బందికి వివరించారు. వైరస్‌ను నిరోధించడానికి ఉమ్మడి కడప జిల్లా యంత్రాంగం పూర్తి చర్యలు తీసుకుంటుందన్నారు. అన్నమయ్య జిల్లాలో 36 లక్షల కోళ్లు ఉన్నాయని, రైతులు వైద్యులు సూచించిన జాగ్రత్తలు తీసుకుంటే వాటికి ప్రమాదం ఉండదన్నారు.

అపోహలను వ్యాప్తి చేయొద్దని సూచించారు. నెల్లూరు జిల్లా నుంచి కోళ్లు, గుడ్లు, దాణాను నిషేధించామన్నారు. వైరస్ 60 డిగ్రీల వేడిలో చనిపోతుందని, భారతీయ వంటలు దాదాపు 100 డిగ్రీల పైబడి వేడిలో వండుతారు కాబట్టి వైరస్ చనిపోతుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని ప్రజలు భయపడాల్సిన పనిలేదన్నారు. అలాగే నెల్లూరు, ఉమ్మడి కడప జిల్లాల సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. పశు కిసాన్ కార్డులను అత్యధికంగా సేకరించిన ఆరోగ్య మిత్ర వెంకటసుబ్బయ్యను జేడీ అభినందించారు. కార్యక్రమంలో ఏరియా పశువైద్యశాల ఏడీ కె.డి.వరప్రసాద్, డాక్టర్ భువనేశ్వరి, ఆరోగ్య మిత్రలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

వ్యక్తిపై కేసు నమోదు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 27 : మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో మహబూబ్‌నగర్ కాలనీలో 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని రమణరావు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి మహబూబ్‌నగర్ కాలనీలో తనిఖీలు చేయగా రమణరావు అనే వ్యక్తి వద్ద 15 మద్యం సీసాలు ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


భక్తులకు తప్పని తిప్పలు

- అధ్వానంగా నిత్యపూజస్వామి కోన రహదారి
- దుమ్ముతో వాహనదారుల అవస్థలు
- చెత్తాచెదారంతో నిండిపోయిన కోనేరు

సిద్దవటం, ఫిబ్రవరి 27 : మండలంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజస్వామి కోనకు వెళ్లే భక్తులకు తిప్పలు తప్పడం లేదు. కోనకు వెళ్లే దారి అధ్వానంగా ఉండటంతో ముందు ఏదైన వాహనం వెళ్లిందంటే వెనుక ఉన్న వారికి దుమ్ము రేగడంతో దారి కనిపించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా లింగాల వద్ద తాగునీటి కోనేరు ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారింది. ఇలాంటి అపరిశుభ్రమైన నీరు తాగాలంటే ఇబ్బందులు పడుతున్నామని భక్తులు పేర్కొంటున్నారు. శివరాత్రి దగ్గర పడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని భక్తులు వాపోతున్నారు. నిత్యపూజస్వామి దేవస్థానం అభివృద్ధి ఏమాత్రం జరగలేదని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఈ విషయంపై ఆలయ చైర్మన్ కొండారెడ్డిని వివరణ కోరగా ఎండోమెంటు శాఖ వారు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని, నిత్యపూజేశ్వరకోనలో వేంపల్లికి చెందిన భక్తుడు ఆలయం చుట్టూ కటాంజనం సమకూర్చాడని తెలిపారు. అలాగే ఆలయం గర్భగుడిలో గ్రానైట్ పనులు కడపకు చెందిన శివ భక్తుడు పనులు చేయించి అభివృద్ధికి నాంది పలికారని ఎండోమెంటు శాఖ తరఫున ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు లేవని పేర్కొన్నారు. శివరాత్రి ఉత్సవాల్లో జిల్లా అధికారులతో జరిగే సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడి




పంచలింగాల వద్ద అపరిశుభ్రంగా ఉన్న కోనేరు



నిత్యపూజస్వామి దేవస్థాన చైర్మన్ కొండారెడ్డి

కోనకు వెళ్లే ప్రధాన దారిలో రేగుతున్న దుమ్ము



నిత్యపూజస్వామి దర్శనానికి కాలినడకన వెళుతున్న భక్తులు

స్తానని చైర్మన్ తెలిపారు. భక్తులు వెళుతున్న వాహనాలను సిద్దవటంలో ఆపివేయడం వల్ల స్వామి భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్ని శాఖల అధికారులు సమిష్టి కృషితో శివభక్తుల విజ్ఞప్తి మేరకు వాహనాలను ఎక్కడా ఆపకుండా పంచలింగాల కోన వరకు పంపించాలని కోరతామన్నారు. పోలీసులు ఎక్కడపడితే అక్కడే వాహనాలను ఆపడం వల్ల భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. ఈ విషయాన్ని కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు.

నిత్యపూజ కోనకు 80 ప్రత్యేక బస్సులు

నిత్యపూజస్వామి కోనకు మహాశివరాత్రి సందర్భంగా 80 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు కడప ఆర్టీసీ డిపో మేనేజర్ దినేశ్వర్‌రావు తెలిపారు. ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసేందుకు మంగళవారం ఆయన పార్కింగ్ పాయింట్లు సిద్దవటం ఈద్గా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు కడప నుంచి పంచలింగాల కోనకు చేరుకునేందుకు 80 బస్సులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే పంచలింగాల కోన వద్ద ఆర్టీసీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ కన్యాకుమారి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దవటం ఈద్గా మైదానాన్ని పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు

గండి ఆలయ పనులను పరిశీలించిన కలెక్టర్



గండి ఆలయ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

చక్రాయపేట, ఫిబ్రవరి 27: గండి క్షేత్రంలో జరుగుతున్న ఆలయ అభివృద్ధి పనులను కలెక్టర్ విజయరామరాజు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. సహాయ కమిషనర్ ముకుందరెడ్డి, చైర్మన్ కృష్ణతేజ, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజాస్వాములు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజలు నిర్వహించి ఆయనకు చిత్రపటాన్ని బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సుమారు రూ.14.50 కోట్లతో జరిగే ఆలయ పనులను పరిశీలించారు. మార్చి 5, 6, 7 తేదీలలో ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎప్పుడు ప్రారంభించాల్సింది తిరుపతిలోని ఆగమపండితులను అడుగుతామని అర్చకులు తెలిపారు. రాజగోపురం, ఆలయ పనులు అసంపూర్తిగా ఉండడంతో గడువులోపు ప్రారంభానికి కష్టమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, అధికారులు పాల్గొన్నారు.

పొలం కోసం ఇరువర్గాల మధ్య ఘర్షణ

ముగ్గురికి గాయాలు

ఖాజీపేట, ఫిబ్రవరి 27: భూమి విషయమై జరిగిన ఘర్షణలో బయపురెడ్డి, రామమోహన్‌రెడ్డి, రంజిత్‌కుమార్‌రెడ్డికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... కొత్తపేటకు చెందిన గోపాల్‌రెడ్డి కడప-కర్నూలు జాతీయ రహదారి పక్కనే చెముళ్లపల్లెకు చెందిన ఓ మహిళ దగ్గర భూమిని కొని పనులు చేసుకుంటుండగా చెముళ్లపల్లెకు చెందిన పత్తి బయపురెడ్డి కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నాడు. ఆ పొలం దగ్గరకు వెళ్లి పనులను ఆపాలంటూ వారికి చెప్పడంతో జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

బీఐఎస్ లేని వస్తువులను కొనుగోలు చేయడం నేరం



మాట్లాడుతున్న బీఐఎస్ సంస్థ జాయింట్ డైరెక్టర్ రాకేశ్

కడప (రూరల్) ఫిబ్రవరి 27: గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు సంబంధించి కొనుగోలు చేసే వస్తువులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్)కు లోబడి ఉండాలని, బీఐఎస్ లేని వస్తువులు కొనుగోలు చేస్తే శిక్షార్హులవుతారని ఆ సంస్థ జాయింట్ డైరెక్టర్ రాకేశ్ తెలిపారు. మంగళవారం జడ్పీలోని డీపీఆర్సీ భవనంలో సర్పంచ్‌లకు, పంచాయతీ సెక్రటరీలకు బీఐఎస్ కార్యక్రమాలపై వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా క్వాలిటీ కంట్రోల్ నిబంధనలను అతిక్రమిస్తే బీఐఎస్ యాక్టు ప్రకారం చట్టరీత్యా రూ.2 లక్షల వరకు జరిమానాతో పాటు జైలుశిక్ష ఉంటుందన్నారు. వస్తువుల కొనుగోలులో బీఐఎస్ గుర్తును తప్పక చూసుకోవాలన్నారు. వస్తువుల నాణ్యతను ఎలా గుర్తించాలి, ఒకవేళ క్వాలిటీ వస్తువులు కొనుగోలు చేయకపోతే తీసుకోవాల్సిన న్యాయపరమైన చర్యల గురించి ఆయన తెలిపారు. జిల్లా పంచాయతీ వనుల కేంద్రం ఫ్యాకల్టీ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పథకాల అమలులో గ్రామ పంచాయతీలు కీలకపాత్ర వహిస్తున్నాయన్నారు. పథకాల అమలుకు సంబంధించి బీఐఎస్‌కు లోబడి వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. అందుకోసమే ఐదు రోజుల పాటు సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు వర్క్‌షాపును చేపట్టి బీఐఎస్ ప్రమాణాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో వర్క్‌షాపు పరిశీలకుడు రమేశ్, ఫ్యాకల్టీ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే మాపై అక్రమ కేసులు

విలేకరుల సమావేశంలో సీఎం సురేశ్‌నాయుడు, లింగారెడ్డి, ముక్తియార్



సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్‌నాయుడు, ముక్తియార్, లింగారెడ్డి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 27 : ప్రొద్దుటూరులో వైసీపీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు టీడీపీలో చేరడం జీర్ణించుకోలేక ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఆయన బావమరిది బంగారురెడ్డి మాపై తప్పుడు ఆ రోపణలతో అక్రమంగా కేసు పెట్టించారని టీడీపీ నేత సీఎం సురేశ్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్ ముక్తియార్ అన్నారు. మంగళవారం అన్నా క్యాంటీన్‌లో ముక్తియార్ విలేకరులతో మాట్లాడుతూ అమీర్ హంజా అనే వ్యక్తి దగ్గర డాక్టర్ గౌస్ కుమారుడు ఫిజియోథెరపిస్టు ఆజాద్ స్థలం కొన్నారన్నారు. స్థలం రిజిస్ట్రేషన్ సమయానికి కొలతలు వేస్తే అది కాలువ పోరంబోకు ప్రభుత్వ స్థలం అని తేలిందన్నారు. దీంతో మాకు ఆ స్థలం వద్దు మా డబ్బులు మాకు ఇప్పించమని తన వద్ద పంచాయితీకి వచ్చారని ముక్తియార్ తెలిపారు. పంచాయితీలో డబ్బులు వెనక్కు ఇస్తామని అమీర్‌హంజా ఒప్పుకున్నారన్నారు. అమీర్ హంజా అన్న తన వాటాకు 7 లక్షల డబ్బులు ఇచ్చాడన్నారు. అమీర్ మాత్రం మూడు లక్షలు ఇచ్చి ఇంకా నాలుగు లక్షలు ఇవ్వకుండా తిప్పుతున్నాడన్నారు. ఇచ్చిన గడువు ముగిసినా పలకడం లేదని డాక్టర్ గౌస్ తన వద్దకు వచ్చి ఫిర్యాదు చేస్తే అమీర్ హంజాను అన్నాక్యాంటీన్‌కు పిలిపించి మాట్లాడామన్నారు. అతనే స్వయంగా వచ్చాడని తామెవ్వరమూ అతడిని బలవంతంగా తీసుకురాలేదన్నారు. అతడి డబ్బులకుగాను అతడి ఇన్నోవా వాహనం మా దగ్గర పెట్టుకోమని అతడే కారు తాళాలు మాకు ఇచ్చి వెళ్లాడని తెలిపారు. అన్నాక్యాంటీన్‌లో జరిగింది అంతేనని అక్కడి సీసీ కెమెరాలు కూడా పరిశీలించవచ్చన్నారు. కానీ దానిని వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, బంగారురెడ్డి రాజకీయం చేసి అమీర్‌ను వైసీపీలో తిరుగుతుంటే తాము తిరగవద్దని కొట్టినట్లు మాపై తప్పుడు ఆరోపణలు చేసి ఈ వ్యవహారంతో ఏ సంబంధం లేని సీఎం సురేశ్ నాయుడుపై, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డితో పాటు మాపై అక్రమ కేసు బనాయించటం దారుణమన్నారు. దీనిపై మేము న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. సురేశ్‌నాయుడు మా ట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మమ్మల్ని చూసి వై సీపీ ఎక్కడ ఖాళీ అవుతుందోనని భయపడుతున్నారన్నారు. మాకు ఎలాంటి సంబంధం లేకున్నా తప్పుడు కేసులో ఇరికించి ఎన్నికలలో ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నాడన్నారు. మాపై తప్పుడు కేసులు నమోదు చేసిన పోలీసులపై ప్రైవేట్ కేసు వేస్తామని తెలిపారు. సమావేశంలో టీడీపీ నేతలు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 27 : వైవీయూ పరిధిలో డిసెంబరులో జరిగిన డిగ్రీ 3, 4 సెమిస్టరు పరీక్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఈశ్వరయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ డిగ్రీకి సంబంధించి బీఏ, బీకాం బీఎస్సీ, బీబీఏ, బీవోసీ మూడో సెమిస్టరులో 64.38 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఈ పరీక్షలకు 5062 మంది విద్యార్థులు హాజరు కాగా 3259 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. అలాగే నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో 8803 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, వీరికి 4989 మంది (56 .64 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ మమత, డాక్టర్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి... అభివృద్ధి చేస్తాం






వేంపల్లె: మాట్లాడుతున్న పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి... కడప: బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న మాధవీరెడ్డి... పెండ్లిమర్రి: పార్టీలో చేరిన వారితో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 27: తెలుగుదేశం పార్టీని ఆదరించండి.. అభివృద్ధి చేస్తామని పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి, ఆయన సతీమణి లతా రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బాబు ష్యూరిటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేంపల్లెలోని బొడ్డుచావిడి, కాలేజీరోడ్డు, బిడాలమిట్ట, తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మైనార్టీ మండల కన్వీనర్ వల్లి, అబ్దుల్ తదితరుల ఆధ్వర్యంలో బీటెక్ రవికి ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి మంచిరోజులు రానున్నాయని, వేంపల్లెలో ప్రజల స్పందన బ్రహ్మాండంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు రఘునాథరెడ్డి, మునిరెడ్డి, నిమ్మకాయల దర్బార్ బాష, రామగంగిరెడ్డి, కత్తలూరు నాగసుబ్బయ్య, పెర్నపాడు అంకిరెడ్డి, రెడ్డి కిషోర్, రవికుమార్, నామా వేమకుమార్, మడక శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు మహబూబ్ షరీఫ్, అల్లాబకాష్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

● టీడీపీ కడప అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 27 : మహిళా సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని, మహిళలంతా ఏకమై చంద్రబాబుకు పట్టం కట్టాలని టీడీపీ కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవీరెడ్డి మహిళలను కోరారు. మంగళవారం 39వ డివిజన్‌లో టీడీపీ జనసేన నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం మెరుగవుతాయన్నారు. వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. ఈ ప్రభుత్వం గ్యాస్ ధరల నుంచి నిత్యావసర వస్తువుల వరకు అన్ని ధరలు పెంచిందని, దీంతో సామాన్యుల జీవనం దుర్భరంగా మారిందన్నారు. అందుకే రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి చరమగీతంపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, నాయకులు లక్ష్మణ్, ఆరిఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

పుత్తా సమక్షంలో 20 కుటుంబాలు చేరిక

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 27: మండలంలోని యు.రాజుపాలెం గ్రామంలో కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన 20 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మంగళవారం యు.రాజుపలెం మాజీ సర్పంచు పాలెం చెన్నారెడ్డితో పాటు టీడీపీలో చేరిన వారికి పుత్తా నరసింహారెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ గంగిరెడ్డిపల్లె పోలీస్‌రాజ, ఎస్.ఆర్.పేట జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచు వెంకటరమణారెడ్డి, ఆంజనేయరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : పుత్తా

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 27: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం ఉలవలపల్లెలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో వివరించారు. ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందో వివరించారు. అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్లలా భావించి పాలన అందించే నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. వైసీపీ చేస్తున్న అరాచకపాలనను చరమగీతం పాడాలన్నారు.

15 మంది టీడీపీలో చేరిక

ఉలవలపల్లె లో మంగళవారం వైసీపీ నుంచి టీడీపీలో 15 కుటుంబాలు చేరాయి. వీరికి పుత్తా నరసింహారెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్ రెడ్డి, పార్టీ నేతలు సుబ్బరామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నాగ సుబ్బయ్య, సత్యమారెడ్డి, గంగాధరరెడ్డి, శ్రీనివాసులు, రమణారెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రఘునాథరెడ్డి, సారథిరెడ్డి, ఆరవేటి చంద్రారెడ్డి, అయ్యవారు రెడ్డి, చెంద్రాయుడు, రామసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన విజయదుర్గాదేవి వార్షిక బ్రహ్మోత్సవాలు


హోమంలో పాల్గొన్న మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు


ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా దేవి అమ్మవారు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 27: కడప నగరం బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో వైభవంగా ముగిశాయి. గత ఐదు రోజులుగా ఆలయంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, చండీహోమాలు, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు చివరిరోజున ఉదయం 10 గంటలకు ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ కుటుంబ సమేతంగా మహాపూర్ణాహుతి నిర్వహించి కలశోద్వాసన, శిఖరప్రోక్షణ చేపట్టారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకు రాహుకాల పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు ధ్వజా అవరోహణ, త్రిశూల స్నానం నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రసాదం, కుడిముద్దలు స్వీకరించారు. అనంతరం రాత్రి 8 గంటలకు వివిధ రకాల పుష్పాలతో అమ్మవారికి పుష్పయాగం నిర్వహించి వార్షిక బ్రహ్మోత్సవాలను ముగించారు.

రవాణా శాఖ సాంకేతిక అధికారుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడిగా ప్రసాద్



కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 27 : రవాణా శాఖ సాంకేతిక అధికారుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడిగా వై.ప్రసాద్ ఎంపికయ్యారు. విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలో గల ఒక హోటల్‌లో ఆదివారం రవాణా శాఖ సాంకేతిక అధికారుల సంఘం ఎన్నికలు జరిగాయి ఈ ఎన్నికల్లో కడప మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టరు వై.ప్రసాద్ రాష్ట్ర సహాధ్యక్షుడిగా ఎంపిక కావడం పట్ల కడప ఆర్టీఓ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

చట్టాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలి

● పారాలీగల్ వలంటీర్ల శిక్షణలో జడ్జి బాబా పక్రుద్దీన్

కడప(రూరల్) ఫిబ్రవరి 27:నూతనంగా నియమించబడిన పారాలీగల్ వలంటీర్లు చట్టాల పట్ల అవగాహనను పెంపొందించుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం న్యాయ సేవాసదన్‌లో నూతనంగా నియమించిన పారాలీగల్ వలంటీర్లకు చట్టాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నూతనంగా నియమించిన పారాలీగల్ వలంటీర్లను లీగల్ ఎయిడ్ క్లినిక్‌లలో నియమిస్తామన్నారు. ఇక్కడ విధులను నిర్వహిస్తూ ప్రజలు ఏవైనా అర్జీలు సమర్పిస్తే వాటిని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులకు ఇవ్వాలన్నారు. వాటిని డీఎల్ఎస్ఏ సెక్రటరీ పరిశీలించి తగు చర్యలను తీసుకుంటారన్నారు. పారాలీగల్ వలంటీర్ల పాత్ర, డ్రెస్ కోడ్, విధుల గురించి, న్యాయసేల అధికార చట్టం 1987 గురించి వివరించారు. అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం 2007 గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శేషాద్రి, ఎ.సుబ్రమణ్యం, జె.ప్రభాకర్, చీఫ్ డిప్యూటీ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ ఎం. శాంత, హరిబాబు, పి. మనోహర్ తదితరులు మాట్లాడారు.

'విహారికి రోజా క్షమాపణ చెప్పాలి'

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 27:క్రికెట్ టీంలో 17వ స్థానంలో ఉన్న వైసీపీ నేత కుమారుడిని తెలుగుతేజం టీమ్ ఇండియా టెస్ట్ స్పెషలిస్టు హనుమ విహారిక మందలించాడనే కారణంతో అతన్ని ఆంధ్ర రంజీ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తొలగించేలా ఒత్తిడి చేసి క్రీడలను రాజకీయాలకు బలి చేశారని కడప అసెంబ్లీ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ విషయంపై హనుమ విహారికి మంత్రి రోజా క్షమాపణలు చెప్పి అతనికి తిరిగి కెప్టెన్సీ ఇచ్చి రాష్ట్ర క్రీడాభివృద్ధికి తోడ్పడాలని డిమాండ్ చేశారు.

తూతూ మంత్రంగా మండల మీట్

వేంపల్లె, ఫిబ్రవరి 27: వేంపల్లె మండల సర్వసభ్య సమావేశం తూతూతమంత్రంగా ముగించారు. కడపలో కలెక్టర్ మీటింగ్ ఉందని అధికారులు వెళ్లడంతో ముఖ్యమైన అధికారులు లేకుండానేసర్వసభ్య సమావేశం సాగింది. ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. జడ్పీటీసీ సభ్యులు అధికారులకు అభివృద్ధి పనులపై తగు సూచనలిచ్చారు.

సోదరభావంతో మెలిగినప్పుడే సమసమాజ స్థాపన సాధ్యం

వేంపల్లె,ఫిబ్రవరి 27: ప్రతి ఒక్కరు తోటి వారితో సోదరభావంతో మెలిగినప్పుడు సమాజ సంస్కరణ సాధ్యపడుతుందని ధార్మికవేత్త మహమ్మద్ యాకూబ్ జామయి తెలిపారు. మంగళవారం వేంపల్లెలో మస్జిదే కూడా నందు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖురాన్ ధర్మ సూత్రాలను ఆచరిస్తూ సర్వజీవన వికాసానికి కృషిచేయడమే ప్రతి ముస్లిం లక్ష్య కావాలన్నారు.

'రహదారికి బ్రౌన్ రోడ్డు పేరు పెట్టాలి'

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 27 :తెలుగుభాషా సాహిత్యభివృద్ధికి తన జీవితాన్ని త్యాగం చేసిన బ్రౌన్ గౌరవ సూచకంగా ఎర్రముక్కపల్లె సర్కిల్ నుంచి బ్రౌన్ లైబ్రరీ వరకు ఉన్న రహదారికి సీపీ బ్రౌన్ రోడ్డు అని పేరు పెట్టాలని సీపీ బ్రౌన్ పాలక మండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఐరన్ బోర్డు ఉండాలని, రోడ్డు డివైడింగ్‌లో భాగంగా బోర్డు తొలగించారాన్నరు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 27: పల్స్‌పోలియోను మార్చి 3న నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అక్కాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎండీ ఉబేదుల్లా పేర్కొన్నారు. మంగళవారం అక్కాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కార్యకర్తలు, వలంటీర్లు, ఆశా కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. హెచ్ఓ వెంకటసుబ్బమ్మ, సూపర్‌వైజర్లు మహబూబ్‌బాషా, మాధవీలత, లక్ష్మీకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 27 :డీఎంఅండ్‌హెచ్ఓ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10గంటలకు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి ఎ.సురేష్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీల్లో వివిధ హోదాల్లో పనిచేసేందుకు గాను అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు.

సఖ్యతగా ఉంటేనే మంగళ వాయిద్యం... అడ్డగోలుగా వాగితే తకిట తాళం

● డిప్యూటీ సీఎం, వైసీపీ శ్రేణులకు నాయీ బ్రాహ్మణుల హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 27: కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగించే తమతో సఖ్యతగా ఉంటేనే మంగళకరమైన వాయిద్యాన్ని వాయిస్తామని, కాదు.. కూడదని రాజకీయాల పేరుతో మా కులవృత్తిని కించపరచేలా వాఖ్యలు చేస్తే తకిట తాళం వాయించి తగురీతిగా బుద్ధి చెబుతామని టీడీపీ నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు హెచ్చరించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల నాయీ బ్రాహ్మణుల సమావేశానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి హాజరై తమకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారన్నారు. అందుకు తాము సుముఖత వ్యక్తం చేయగా ఆ మేరకు స్పందించిన ఆయన సంతోషంతో తమ కులవృత్తి వాయిద్యమైన డోలును భజాయించారన్నారు. దీంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడిపై కొంతమంది డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు చెందిన వైసీపీ నేతలు అపహాస్యం చేసేలా అనుచిత వాఖ్యలు చేస్తూ తమ కులవృత్తిని పరోక్షంగా అపహాస్యం చేయడం బాధాకరమన్నారు. శుభ, అశుభ కార్యక్రమాలకు తమ వాయిద్యాలు ఎంతో అవసరమన్నారు. అలాంటిది రాజకీయం పేరుతో తమ కులవృత్తిని కించపరచేలా చేసిన వారికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, నాయకులు పి.వెంకటసుబ్బయ్య, కె.నాగరాజు, ఎన్. వెంకటేశ్వర్లు, భజంత్రి నాగేసుడు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరిచిప్పల వేలం పాట ద్వారా రూ.14.20 లక్షల ఆదాయం

చక్రాయపేట, ఫిబ్రవరి 27: గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం సహాయ కమీషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజల ఆధ్వర్యంలో తలనీలాలు, కొబ్బరిచిప్పలు, కూరగాయలు సరఫరా వాటికి వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ఏడాది పాటు భక్తులు సమర్పించే కొబ్బరిచిప్పలను పోగుచేసుకునేందుకు జ్ఞానేశ్వర్‌నాయుడు రూ.14,20,516 అధికంగా పాడి పాటను దక్కించుకున్నారు. తలనీలాలు గత ఏడాది రూ.1.10కోట్లకు పలుకగా ఈ ఏడాది టెండర్ దారులు రూ.60లక్షలు పాడారు. దీనితో ఈ పాట వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి ఎప్పుడనేది తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ జిల్లా ఇన్‌స్పెక్టర్ జనార్దన్, బ్యాంకు మేనేజర్ అశోక్‌కుమార్, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి జానమద్ది


జానమద్ది చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 27 : ప్రముఖ కవి, రచయిత జానమద్ది హనుమచ్ఛాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలి అని జిల్లాలో పేరు పొందారని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ పేట్రన్ పద్మప్రియ చంద్రరెడ్డి అన్నారు. మంగళవారం కొండూరు పిచ్చమ్మ వెంకటరాజు స్మారక సంస్థ కార్యాలయంలో జానమద్ది 10వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమచ్ఛాస్త్రిలాంటి గొప్ప వ్యక్తులుజిల్లాకే గర్వకారణమన్నారు. పుట్టపర్తి హనుమచ్ఛాస్త్రిలాంటి గొప్ప వ్యక్తుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. అనంతరం స్మారక సంస్థ అధ్యక్షుడు కొండూరు జనార్ధన్‌రాజు మాట్లాడారు.సంస్థ సభ్యులు చిల్లారి రెడ్డయ్యరాజు, గొబ్బూరి కోటేశ్వర్‌రావు, డేవిడ్, సతీష్, జ్యోతి జార్జి, ఫణికుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులపై ఉర్దూ భాషలో నేమ్‌బోర్డు రాయించండి: రూటా

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 27: ఏపీఎస్ ఆర్టీసీ బస్సులపై ఉర్దూ భాషలో నేమ్‌బోర్డులు రాయించాలని రూటా రాష్ట్ర సమన్వయ కర్త మహ్మద్ ఆయుబ్, రాష్ట్ర నాయకులు వసీవుల్లా భక్తియారి డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కార్యాలయంలో చైర్మన్ మల్లిఖార్జునరెడ్డిని కలసి వారు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో 80 లక్షల మంది మాతృభాష ఉర్దూ కలిగి ఉన్నారని, వారందరినీ దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ బస్సులపై ఉర్దూభాషలో నేమ్ బోర్డులు రాయించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్‌హుసేన్, రాష్ట్ర నాయకులు షాబుద్దీన్‌షేక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ముదిరాజ్ సాధికార సమితి కడప పార్లమెంట్ కన్వీనర్‌గా సుంకర


సుంకర నాగేశ్వరరావు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 27: తెలుగుదేశం పార్టీ ముదిరాజ్ సాధికార సమితి కడప పార్లమెంట్ కన్వీనర్‌గా సుంకర నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఆ మేరకు టీడీపీ బీసీ సంఘాల రాష్ట్ర కన్వీనర్ కొల్లు రవీంద్ర చేతులమీదుగా నియామక పత్రాలను ఆయన అందుకున్నారు. గత 25 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ జిల్లా కార్యదర్శిగానే కాకుండా పార్టీ అభ్యున్నతికి జమ్మలమడుగు, యర్రగుంట్ల, వీరపునాయునిపల్లె తదితర ప్రాంతాలలో పార్టీ బలోపేతానికి కృషి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను వమ్ముచేయకుండా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయకేతనం ఎగుర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డికి, జమ్మలమడుగు టీడీపీ యువనాయకుడు భూపేష్‌రెడ్డికి, కొల్లురవీంద్రకు

'దివ్యాంగులు ఆర్థికాభివృద్ధి సాధించాలి'

చెన్నూరు, ఫిబ్రవరి 27: దివ్యాంగులు ఆర్థికాభివృద్ధి సాధించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.సుబ్రమణ్యం అన్నారు. స్థానిక ఆది గాయత్రి వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఐదురోజుల పాటు జరుగుతున్న శిక్షణ శిబిరంలో ముగింపు కార్యక్రమానకి మంగళవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులు ఆర్థిక సమస్యలను ఎదుర్కొని ముందుకెళ్లాలన్నారు. అందుకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరిలో నైపుణ్యం ఉంటుందని, దాన్ని శిక్షణ ద్వారా వెలికితీసి ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. అవకాశం ఉన్న రంగాల్లో శిక్షణ పొంది అభివృద్ధి చెందాలన్నారు.అనంతరం సుబ్రమణ్యంను ఆదిగాయత్రి వికలాంగుల సంక్షేమ సంఘం తరపున సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు బసిరెడ్డి, సభ్యులు మహేశ్వర్‌రెడ్డి, కుం దేటి చిన్న రెడ్డిసావిత్రి, పవిత్ర పాల్గొన్నారు

మహా ధర్నాను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మద్దిలేటి

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 27 : ఆంధ్రప్రదేశ్‌లో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ ఉద్ది మద్దిలేటి డిమాండ్ చేశారు. అలాగే ఫిబ్రవరి 29న కలెక్టరు ఆఫీసు వద్ద మహా ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం చిలకలబావి వద్ద ఉన్న హోచిమన్ భవన్ ఏఐటీయూసీ ఆఫీసులో విలేకరులతోత మాట్లాడారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

● నియోజకవర్గ ఎన్నికల అధికారి చంద్రమోహన్


మాట్లాడుతున్న ఎన్నికల అధికారి చంద్రమోహన్

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 27 : రానున్న సార్వత్రిక పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి చంద్రమోహన్ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక డిగ్రీకళాశాలలో రానున్న ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం చేసేందుకు సిబ్బందికి ఒక్క రోజు శిక్షణను తహసీల్దారు సుబ్రమణ్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంటు శిక్షణ, మెటీరియల్, ట్రాన్స్‌పోర్టు, పోస్టల్ బ్యాలెట్, స్వీప్ యాక్టివిటీస్, సీ.విజిల్, ఈవీఎం మేనేజ్‌మెంటులతో పాటు ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్ తదితర అంశాల నిర్వహణలో అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించి అక్కడ చేపట్టవలసిన ప్రాథమిక చర్యలపై దృష్టి సారించాలన్నారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను 16 మంది నోడల్ అధికారులతో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమీక్షించి పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థికి 90 లక్షలు ఖర్చు చేసే అధికారం ఉందని, అంతకు మించి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేసినా అది ఎన్నికల నియమాలకు విరుద్ధమన్నారు. స్థానిక సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు నరేంద్ర, ఆర్ఐ అర్జున్‌తో పాటు అధికారులు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిటీ నివేదికను అమలు చేయాలి


మాట్లాడుతున్న బండి జకరయ్య

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 27: స్వామినాథన్ కమిటీ నివేదికను అమలు చేయాలని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి జకరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఏ సత్తార్, నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరి ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా రైతులు చేస్తున్న పోరాటాలకు పార్టీ మద్దతు ఇస్తుందన్నారు.

'మరోసారి ఫ్లెక్సీలు చించితే వైసీపీ నేతల ఇళ్లపై టీడీపీ జెండాలు ఎగురవేస్తాం'


మాట్లాడుతున్న చెన్నంశెట్టి మురళి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 27: కడప నగరంలో మరోసారి టీడీపీ ఫ్లెక్సీలు చించితే వైసీపీ నేతల ఇళ్లపై టీడీపీ జెండా ఎగురవేస్తామని టీడీపీ నాయకులు చెన్నంశెట్టి మురళి హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండురోజుల క్రితం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి 32, 34, 35 డివిజన్లకు సంబంధించిన కార్యాలయాన్ని ప్రారంభించారని, అందులో భాగంగా నకాష్‌లో టీడీపీ కార్యకర్తలు బ్యానర్లు, ఫ్లెక్సీలు కట్టారన్నారు. అయితే స్థానిక కార్పొరేటరు షంషీర్ ఆయన అనుచరులు కలిసి టీడీపీ బ్యానర్లు, ఫ్లెక్సీలను చించివేసినట్లు తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం అయితే వైసీపీ నాయకుల ఇంటిపైనే టీడీపీ జెండాలు ఎగురవేస్తామన్నారు. టీడీపీ నాయకులు గంపా వీరయ్య, సగబాల రెడ్డయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి: ఎస్టీయూ


డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 27 : సీకేదిన్నె మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్‌సీ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎస్టీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అనురాధకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జడ్పీ పాఠశాలలో దశాబ్దాలుగా ఎస్ఎస్‌సీ పరీక్ష కేంద్రం కొనసాగుతున్నా ఇప్పుడు చైతన్యస్కూలులో ఏర్పాటు చేయడం శోచనీయమన్నారు. ఫర్నీచరు లేదన్న సాకుతో పరీక్ష కేంద్రాన్ని మార్చడం సరికాదన్నారు. ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎఫ్ఏ 4 పరీక్షల్లో అంబేడ్కర్‌కు అవమానం

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 27 : పాఠశాల విద్య ఎఫ్ఏ 4 పరీక్షల్లో 8వతరగతి సోషల్ పేపరులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌ను అవమానపరుస్తూ దళిత నాయకుడిగా ముద్రించి ప్రశ్నపత్రం రూపకల్పన చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీటీఏ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జ్యోతి రామచంద్రబాబు, డాక్టర్ హరికొండయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బీటీఏ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ సోమవారం జరిగిన 8వతరగతి సోషల్ ప్రశ్నాపత్రంలో ఐదో ప్రశ్న దళిత ఉద్యమ నాయకుడు ఎవరుకు జవాబుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌గా రూపొందించడాన్ని బీటీఏ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రపంచ మేధావి, ఆర్థిక వేత్త, నవభారత రాజ్యంగ నిర్మాత అని అన్ని రంగాల్లో ప్రావీణ్యం కలిగిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. 193 దేశల్లో అంబేద్కర్ విగ్రహాలు స్వచ్ఛందంగా నిర్మిస్తున్నారన్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి అంబేద్కర్ జన్మదినాన జ్ఞానదినోత్సవంగా ప్రకటించిన తరువా కూడా దళిత కుటుంబంలో జన్మించిన కారణంగా ఆయనను దళిత నాయకుడుగా ముద్ర వేసి పిల్లల్లో చొప్పించడం దుర్మార్గమన్నారు. దీనికి కారకులైన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డి మాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, మధుసూధన్, పెంచలయ్య రమణ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీల ధర్నా

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 27 : రాష్ట్ర వ్యాప్తంగా ఐఎంఎల్ డిపోలో పనిచేస్తున్న బేవరేజ్ హమాలీ కార్మికులకు ఎగుమతి రేట్లు అక్టోబరులో పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, హామీని వెంటనే అమలు చేయాలని కడప ఐఎంఎల్ డిపో వద్ద సీఐటియు ఆధ్వర్యంలో హామాలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావడంలో ఎక్సైజ్ శాఖ ప్రధానమైన ఆదాయ వనరు అని తెలిపారు. అందులో బేవరేజ్ హమాలీలు ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్‌కు ఎగుమతి చేయడం దిగుమతి చేయడంలోనూ కీలక పాత్ర హమాలీలు పోషిస్తున్నారన్నారు. ఐఎంఎల్ బేవరేజ్‌హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్వీ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎక్సైజ్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రతి కార్యకర్త టీడీపీ గెలుపునకు కృషి చేయాలి

ముద్దనూరు ఫిబ్రవరి27:ప్రతి కార్యకర్త టీడీపీ గెలుపునకు కృషి చేయాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు.స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ముద్దనూరు, ఎర్రగుంట్ల, కొండాపురం టీడీపీ క్లస్టర్ ,యూనిట్,బూత్ ఇన్‌చార్జీలతో డోర్ టు డోర్ శంఖారావం అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డోర్ టు డోర్ శంఖారావం కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, టౌన్ ఇన్‌చార్జి రంగారెడ్డి,కేశవరెడ్డి, జగదీశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, వేల్పుచర్ల రామాంజనేయరెడ్డి, బాబు రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసిన పార్టీలకే మద్దతు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 27 : సీపీఎస్ రద్దు చేసిన పార్టీలకే ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీవీ రవీంద్రుడు తెలిపారు. మంగళవారం హోమస్ పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఓట్ ఫర్ సీపీఎస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీపీఎస్ రద్దు చేయకపోగా జీపీఎస్‌ను ప్రవేశపెట్టి ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నాగరాజు, మోహన్ కుమార్, సరళాదేవి, పార్వతి, జయలక్ష్మి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద కుటుంబానికి నెలకు రూ.5వేలు : పీఎండీ నజీర్

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 27 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద కుటుంబానికి నెలకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ నియోకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అనంతపురంలో నిర్వహించిన న్యాయసాధన సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారన్నారు. ప్రతినెలా పేద కుటుంబాలకు ఒకటో తేదీనే రూ.5వేలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు జిలాన్, మండలాధ్యక్షుడు రామాంజనేయులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బూత్‌లో టీడీపీ మెజార్టీనే లక్ష్యంగా తీసుకోవాలి

బూత్, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలకు భూపేశ్‌రెడ్డి సూచన

జమ్మలమడుగు, ఫిబ్రవరి 27: నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ బూతులో టీడీపీ అత్యధిక మెజార్టీ సాధించేందుకే లక్ష్యంగా పనిచేయాలని క్లస్టర్, బూత్ యూనిట్ ఇన్‌చార్జిలకు జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సూచించారు. మంగళవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయం ఆవరణలో క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌చార్జిలతో శంఖారావం, డోర్ టు డోర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మినీ మేనిఫెస్టో విడుదల చేశారని, అందులో సూపర్-6 పేరుతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేలా ఆరు పథకాలను పొందుపరిచారన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పని చేస్తే ప్రతి బూత్‌లో టీడీపీ మెజార్టీ సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జనసేన నాయకుడు నాగార్జున, టీడీపీ నాయకులు తలమంచిపట్నం లక్ష్మణనాయుడు, బ్రహ్మయ్య, సంతోష్, గౌస్‌మోద్దీన్, షరీఫ్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేసేందుకు కృషిచేయాలి

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 27: నవంబరు 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సిబ్బంది కృషిచేయాలని అర్బన్, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనాథ్‌రెడ్డి, జ్యోత్స్న పేర్కొన్నారు. మంగళవారం అర్బన్ హెల్త్ సెంటర్‌లో బూత్‌లో పనిచేసే వారందరికీ ఓరింటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5సంవత్సరాల చిన్నారుల వరకు పోలియో టీకాలు వేయాలన్నారు. ఈకార్యక్రమంలో హెచ్ఈవో రవిశంకర్, ఐసీడీయస్ సూపర్‌వైజర్లు, సూపర్‌వైజర్లు ఓబులేసు, లక్ష్మీదేవి, సీహెచ్‌వో సచివాలయ సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ధరలు పెరిగి ప్రజలకు ఇక్కట్లు

సీపీఎం కార్యదర్శి జి.యేసుదాసు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 27: వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలు అర్థాకలితో అలమటిస్తున్నారని జమ్మలమడుగు సీపీఎం కార్యదర్శి జి.యేసుదాసు విమర్శించారు. మంగళవారం జమ్మలమడుగులోని మున్సిపల్ మస్టర్‌పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో రైతులకు, రైతు కూలీలకు ఇంతవరకు కనీసం సెంటు భూమి కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి విజయ్, అంజనేయులు, దివాకర్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోని అక్రమార్కులందరికీ జైలు తప్పదు





ప్రొద్దుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, అమృతనగర్‌లో కాలువలు అధ్వానంగా ఉండటాన్ని పరిశీలిస్తున్న సురేశ్‌నాయుడు, లింగారెడ్డి, పోరుమామిళ్లలో ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జ రోశన్న

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 27 : ఒక్కసారి అధికార మిచ్చినందుకు రాష్ట్రాన్ని దోచి సర్వనాశనం చేశాడని వైసీపీలోని అక్రమార్కులందరూ జైలుపాలు కాకతప్పదని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాళ్ళమాపురం పంచాయతీలోని మూలవారిపల్లెలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాబు ఆరు గ్యారెంటీల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి, నాగమునిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, సేతలు మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మెన్ మల్లికార్జున, జనసేన నాయకుడు మంచి శివకుమార్, మాజీ ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య, శివ,శ్రీను,రాజేష్,దస్తగిరి శిఖామణి, శివప్రసాద్, చిన్నకొండారెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ వ్యాపారులకు టీడీపీ న్యాయం చేస్తుంది

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 27 : ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్ వ్యాపారులకు టీడీపీ న్యాయం చేస్తుందని టీడీపీ నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు హామీ ఇచ్చారు. మంగళవారం ఉదయం కూరగాయల మార్కెట్, వివేకానంద క్లాత్ మార్కెట్ ఏరియాలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా సురేష్ నాయుడు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం రాగానే తాత్కాలిక కూరగాయల మార్కెట్‌నుంచి ప్రతి ఒక్కరికి నూతన మార్కెట్‌లో స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మెన్ ముక్తియార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఈవీ సుధాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు కాగా సాయంత్రం అమృతనగర్ ప్రచారం బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గారెంటీ కార్యక్రమంసీఎం సురేశ్‌నాయుడు ఆధ్వర్యంలో చేపట్టారు. అక్కడ సమస్యలను స్వయంగా పర్యవేక్షించారు. వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పోరుమామిళ్ల..: సార్వత్రిక ఎన్నికల్లో సైకిలు గుర్తుకు ఓటు వేసి టీడీపీని ఆదరించాలని బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న అన్నారు. మంగళవారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని గిరినగర్‌కాలనీ, నర్సింగ్ కొట్టాల ప్రాంతాల్లో టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కల్వకూరి చిన్నవెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ కల్వకూరి రమణ, టీడీపీ జిల్లా కార్యదర్శి తిరుమలశెట్టి సుబ్బారావు, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు బండి ఓబులేసు, శివశంకర్, పాపయ్య, చెన్నకేశవులతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: చంద్రబాబు అధికారం చేపడితేనే రాష్ట్రాభివృద్ధి తథ్యమని బొజ్జఅరుణ, జిల్లా మైనార్టీ కార్యనిర్వహక కార్యదర్శి హబీబున్నీసా, తెలుగుమహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని రిక్షాకాలనీలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగరత్నమ్మ, ప్రమీల, కేవీ సుబ్బారెడ్డి, సాంబశివారెడ్డి, సుబ్బరాయుడు, వెంకటసుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు, ఫిబ్రవరి 27: వచ్చే ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తల్లి సరస్వతి, భార్య జ్యోతి ప్రజలను అభ్యర్థించారు. మంగళవారం జమ్మలమడుగు మున్సిపాలిటీలో 20వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జికెగైబు, డ్రైవర్ నాగూర్, గైబూసా, అన్వయర్, గౌస్‌లాజం, షబ్బీర్, మునేషులు, నజీర్, ఆజం, షేక్షా, భాగ్యమ్మ, దేవమ్మ, మహేంద్ర, రామమోహన్, మహిళలు పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్.. దొంగలు

- 10 వ్యవసాయ మోటర్ల వైర్లు కత్తిరించుకపోయిన గుర్తుతెలియని వ్యక్తులు
- వరుస దొంగతనాలతో బెంబేలెత్తిపోతున్న రైతన్నలు

కాశినాయన ఫిబ్రవరి 27: మండలంలో రాత్రుల్లో దొంగతనాలు పెరిగిపోయాయని రైతులు వాపోతున్నారు. సోమవారం రాత్రి పిట్టిగుంట బస్టాప్ వద్దనుంచి ఉప్పలూరు సగిలేరు సమీపం వరకు రోడ్డువెంటఉన్న పీరయ్య, నర్శిరెడ్డి,నరసింహారెడ్డి, క్రిష్ణమోహన్‌రెడ్డి,శీలారెడ్డి,బాలవెంకటరెడ్డి,సుబ్బారెడ్డి తదితర 10 మంది రైతుల వ్యవసాయ మోటార్ల వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు కత్తరించుకపోయారు. అసలే అరకొరక కరెంట్‌తో పొలాలకు నీళ్ల సరిపోక రైతులు అల్లాడుతుంటే మధ్య మధ్యలో ఇలాంటి వైర్లు దొంగిలించే వారితో ఇంకా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓబుళాపురం గ్రామంలో గురయ్య అనే రైతుకు చెందిన 12 గొర్రెలను ఎత్తుకెళ్లారు. ఈవిషయం మరిచిపోకముందే చెన్నారెడ్డిపల్లె ఎస్సీకాలనీలో ఆరుబయట కట్టివేసిన మేకల్ని ఎత్తుకెళ్లారు. ఇలాంటి వరుస సంఘటనలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పోలీసులు స్పందించి చోరీలకు పాల్పడుతున్న దొంగల ఆటకట్టించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నెలరోజులకే మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున బదిలీ

అధికారపార్టీ పెద్దల విముఖతతోనే వెళ్లినట్లు ప్రచారం

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 27 : ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వచ్చిన నెలరోజులకే బదిలీ అయ్యారు. ఆమేరకు మంగళవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్‌డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మి జీవో నెంబర్ 234 జారీ చేశారు. ఆయన స్థానంలో ఆదోని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ఇక్కడికి బదిలీపై రానున్నారు. మల్లికార్జున వచ్చిన నెలరోజులకే ఆయన 25 రోజుల సెలవు కోరడం జరిగింది. ఎన్నికలు సమీపిస్తున్నందున సెలవులో ఎవ్వరికి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వడం కుదర దని ఉన్నతాధికారులు తెలిపారు. బదిలీ తప్ప మరో మార్గం లేకపోవడంతో ఆయన బదిలీకి అంగీకరించినట్లు తెలిపారు. 25 రోజుల సెలవుల తరువాత ఆయనను డీఎంఏ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవా ల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో అధికారపార్టీ పెద్దలు కమిషనర్ మల్లికార్జున పట్ల విముఖతతో వుండటం వలనే ఆయ న వచ్చిన కొద్దిరోజులకే సెలవులు పెట్టుకోవడం కానీ బదిలీ చేయడం గానీ జరిగిందనే ప్రచారం సాగుతోంది.

బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా మనోహర్‌రెడ్డి

కాశినాయన ఫిబ్రవరి27: కాశినాయన మండలం గంగనపల్లె గ్రామానికి చెందిన బుసిరెడ్డి మనోహర్‌రెడ్డిని బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా నియమితులయ్యారు. ఆమేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి అధికారికంగా ప్రకటించిన కమిటీలో మనోహర్‌రెడ్డి పేరు చోటుచేసుకుంది. ఈసందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ యువమోర్చ రాష్ట్రకార్యవర్గంలో తనకు అవకాశం కల్పించిన బీజేపీ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పేదలకోసమే సంక్షేమ పథకాలు



పథకాలను ప్రజలకు వివరిస్తున్న సుబ్బరాయుడు

చాపాడు, ఫిబ్రవరి 27: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేద ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సంక్షేమం, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టినట్లు మైదుకూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు చెప్పారు. తప్పెట ఓబాయపల్లె, బసిరెడ్డిపల్లె, రేపల్లె, గుంతచీపాడు, చియ్యపాడు గ్రామాల్లో మంగళవారం బీజేపీ నాయకులు ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన అయూష్మాన్ భారత్, గరీబ్ కల్యాణ్ యోజన, పీఎం ఈవై, పీఎంకిసాన్‌యోజన, జలజీవన్ మిషన్ వంటి పథకాల గురించి వారు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు బొగ్గుల చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, రామకృష్ణ, లక్షుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలి



పుట్టాకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న మైనార్టీ నాయకులు

ఖాజీపేట, ఫిబ్రవరి 27: ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీకోసం సైనికుల్లా పనిచేయాలని మైనార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి ఫరూక్ అహమ్మద్ అన్నారు. మంగళవారం మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టాసుధాకర్‌యాదవ్‌ను కలిసి సన్మానించారు. పార్టీ కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేఎస్.నూరుల్లా, కొత్తపల్లె ఖాజామొహిద్దీన్, సి.ఆర్.బాషా, డాక్టర్ ఆసీఫ్, కేఎస్.షఫీపుల్లా, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇంటి స్థలాలివ్వాలి

బద్వేలు, ఫిబ్రవరి 27: అర్హులైన దివ్యాంగులకు ఇళ్ల స్థలాలతో కూడిన కాలనీ ఏర్పాటు చేసి ఇవ్వాలని, దళిత హక్కు పోరాట సమితి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటరమణ, సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి పి.వి.రమణ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయ ఏవో నిత్యానందరాజుకు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల నాయకులు కదీరుల్లా బాషా, ఖాదర్‌బాషా, ప్రసన్నకుమార్, కేశవ ప్రతాప్‌రెడ్డి, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా మట్టి తరలింపు

- అడ్డుకున్న గ్రామస్థులు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఖాజీపేట, ఫిబ్రవరి 27: ప్రతిరోజు వందల ట్రాక్టర్ల మట్టిని తరలిస్తూ వాహనదారులు లక్షలు గడిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా అధికారులకు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఖాజీపేట మండల పరిధిలోని కన్నెలవాగు చెరువు సమీపంలో కొత్తపేటకు చెందిన కొందరు భారీ గుంతలు పెట్టి చెరువు కట్ట కిందభాగంలో మట్టిని తీస్తుండడంతో చెరువుకు ప్రమాదని గ్రామస్థులు అడ్డుకోవడంతో అక్రమార్కులు ట్రాక్టర్లు, ఎక్సకవేటర్లు తీసుకుని వెళ్లిపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులతో పర్మిషన్ తెచ్చుకునితోలుకోండి అంతేకాని ఇష్టానుసారంగా తోలితే ఒప్పుకునేది లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేగాక పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.




మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ భారీ గుంతలు

40 కుటుంబాలు టీడీపీలో చేరిక



భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వారు

మైలవరం, ఫిబ్రవరి 27: మండలంలోని వేపరాల గ్రామంలో 40 కుటుంబాలు మంగళవారం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో మాజీ ఉపసర్పంచ్ బడిగించల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ సుబ్బరాయుడు, సత్య, శ్రీనివాసులు, రమణ, వెంకటరమణ, చౌడప్ప, చిన్నరంగడు, నాగరాజు, మునిశేఖర్, వెంకటేష్, రాఘవ, చంద్రశేఖర్, సుబ్బయ్య, విశ్వనాథ్, రామకృష్ణ, రంగనాథ్, శ్రీను, ఉపేంద్ర, చిన్న సుబ్బరాయుడుతో పాటు పలువురు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మైలవరం క్లస్టర్ ఇన్‌చార్జ్ రాజారెడ్డి, తదితర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 27 : టీడీపీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని జనసేన నాయకుడు మాదాసు మురళి డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన కూటమికి వస్తున్న ప్రజాధరణను ఓర్వలేకనే వైసీపీ నాయకులు టీడీపీ నాయకులు సీఎం సురేశ్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మున్సిపల్ మాజీ ఇన్‌చార్జి చైర్మన్ వీఎస్ ముక్తియార్‌పై తప్పుడు కేసు బనాయించారన్నారు. స్థలం వివాదంలో అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో పోలీసులు తప్పుడు కేసులు బనాయించారన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేయాలని కోరారు.

నృత్య ప్రదర్శనలో విద్యార్థినుల ప్రతిభ



సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న స్కూలు కరస్పాండెంట్ తదితరులు

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 27 : బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని బద్వేలు పబ్లిక్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు గత నెల 29న హైదరాబాదులో జరిగిన కూచిపూడి మహానృత్యంలో సత్తా చాటి వరల్డ్ బుక్ రికార్డులో చోటు దక్కించుకున్నారని డాక్టర్ గోపాలక్రిష్ణయ్య, డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ కోటా సుమన్ అన్నారు. హైదరాబాదు కూచిపూడి మహానృత్యంలో బృంద నాట్యంలో శివపంచాక్షరి కూచిపూడి నృత్యంలో 300 మంది నాట్య కళాకారులు పాల్గొన్నారు. వీరిలో సౌత్ జోన్ బుక్ ఆఫ్ రికార్డులో బద్వేలు పబ్లిక్ స్కూలు విద్యార్థినులు వెంకట సహస్ర, మనస్విని, ప్రణవి బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎంపిక య్యారు.

హైవేలో అండర్‌రోడ్డు వేయాలి



ఆందోళన చేస్తున్న మహిళా రైతులు

మైదుకూరు, ఫిబ్రవరి 27 : మైదుకూరు పట్టణ పరిధి మీదుగా నిర్మాణం చేపడుతున్న హైవే బైపాస్ రోడ్డులో రైతులు తమ పొలాలకు వెళ్లటకు వీలుగా అండర్ రోడ్డును వేయాలంటూ మహిళా రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. మున్సిపల్ పరిధిలోని గడ్డమాల వాడ, సర్వాయపల్లి, మైదుకూరు తదితర ప్రాంతల్లో ఉన్న చాలా మంది రైతులకు వ్యవసాయ భూములున్నాయని, వారంతా వెళ్లేటందకు జాతీయ రహదారి అడ్డుగా వేస్తున్నారన్నారు. అటుగా వెళ్తే అటు ట్రాఫిక్‌తో పాటు పలు ప్రమాదాలు జరిగే అవకాశముందని, రైతుల కోసం అండర్ సర్వీస్ రోడ్డు వేయాలని రైతులు పనులు జరుగుతున్న ప్రాంతంలో ఆందోళన చేపట్టారు.

ప్రతి బూత్‌లో మౌలిక వసతులు కల్పించాలి

ఖాజీపేట, ఫిబ్రవరి 27: మండల పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్‌లో మౌలిక వసతులు కల్పించాలని ఈఆర్‌వో ఎ.రామమోహన్ అన్నారు. మంగళవారం చెన్నముక్కపల్లె పంచాయతీలోని 202, 203 బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయడంలో విఫలమైతే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు కెజియా, సిబ్బంది పాల్గొన్నారు.

అడుగంటుతున్న కుందూ..!

రాజుపాలెం, ఫిబ్రవరి 27 : గత ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో డ్యామ్‌లలో నీరు నిల్వ లేక ఆ ప్రభావం కుందూపై పడింది. ఏప్రిల్, మే నెలలో ఎండిపోతున్న కుందూ ఇప్పుడు ఫిబ్రవరి నెలలోనే ఎండిపోతుండడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. కుందూకు ఇరువైపులా పూలతోటలు, వరి తదితర పంటలకు నీటి ఎద్దడి వచ్చేవిధంగా ఉందని రైతులు పేర్కొన్నారు. కుందూకు గత 15 రోజులకొకసారి తడుల రూపంలో నీరందిస్తే సాగైన పంటలు పండుతాయని రైతులు తెలిపారు. ఏది ఏమైనా కుందూ పరిస్థితి నీళ్లు లేక చాలా అధ్వానంగా తయారైంది.

